క్లుప్తంగా

పెనుబల్లి మండలానికి 21మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు

పెనుబల్లి: గ్రామాల్లో నెలకొన్న భూముల వివాదాలు పరిష్కారానికి, భూమి కొలతల కోసం 21మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఉన్నతాధికారులు పెనుబల్లి మండలానికి కేటాయించారు. వారిలో 17మంది తహసీల్‌లో రిపోర్టు చేశారని తహసీల్దార్ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. వీరికి భూమి కొలతలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి


గ్రామస్తులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

వైరారూరల్: అధ్వానంగా ఉన్న మండలంలోని తాటిపూడి – కొత్తముసలిమడుగు గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని, నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తాటిపూడి గ్రామ ప్రజలతో కలిసి లింక్ రోడ్డును పరిశీలించి మాట్లాడుతూ.. గ్రావెల్ రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారి అడుగు తీసి వేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్తముసలిమడుగులోని గిరిజన బాలికల సంక్షేమ పాఠశాల, కళాశాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో.. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సావిత్రి, మణి, సర్వమ్మ, రాజు, సురేష్ తదితరులున్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీని అభినందిస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జూపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కొంగర వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా పి.రఘు, ఉపాధ్యక్షుడిగా కుదురుపాక నాగేశ్వరావు, మరి కొంత మంది సభ్యులను ఏకగ్రీవ ఎన్నిక చేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కన్వీనర్ నర్సింహారావు, కోకన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ కమిటీ ఎన్నిక


మండల అధ్యక్షుడికి నియామకపత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకట్, సభ్యులు

ముదిగొండ: ముదిగొండ మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కమిటీ శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సామాల కోటేశ్వరరావు, కార్యదర్శిగా పట్ల అశోక్, కోశాధికారిగా మేకపోతుల చిన్నచందర్ రావుగౌడ్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, జిల్లా కోశాధికారి తిరుపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, దామోదర్, ఖమ్మంటౌన్ అధ్యక్షుడు రఘు, మండల ఫొటో గ్రాఫర్లు లక్ష్మయ్య, నాగేశ్వరరావు, వెంకట్, జానిమియా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి లైట్లు


అంధకారంలో.. బీసీ కాలనీలోని ఓ వీధి

కొణిజర్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో వీధిలైట్లు లేక గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. గతంలో ఉన్న వీధిలైట్లను ఉదయం నిలిపివేసే వారు లేక 24 గంటలు వెలుగుతున్నాయి. ఈ క్రమంలో ట్రాన్స్‌కో అధికారులు వీధిలైట్లకు కనెక్షన్లు కట్ చేశారు. దీంతో గత నెల రోజులుగా కొణిజర్లలో వీధిలైట్లు వెలగక వీధులన్నీ అంధకారంలో అల్లాడుతున్నాయి. పంచాయతీ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వీధిలైట్లు పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో రాఖీ స్టాళ్ల వద్ద కొనుగోలు చేస్తున్న మహిళలు



రాఖీలో చ్యాయ్..

నేడు రక్షాబంధన్ వేడుకలు

- జోరుగా రాఖీల విక్రయాలు
- ఆకర్షణీయంగా పలురకాల మోడళ్లు..
- పయణమైన సోదరీమణులు


సత్తుపల్లిలోని రాఖీల షాప్

సత్తుపల్లిటౌన్/తల్లాడ/కారేపల్లి: అక్కా తమ్ముళ్లు.. అన్నా చెల్లెళ్ల అనురాగానికి.. అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఈ పండుగ కోసం సత్తుపల్లి, కారేపల్లి, తల్లాడలో రాఖీల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి. ఈ నెల 9న జరుపుకునే రక్షా బంధన్‌ను పురస్కరించుకొని తమ సోదరులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని దృఢంగా చేసుకోవడానికి సోదరీమణులు సిద్ధమౌతున్నారు.

వైవిధ్యమైన రాఖీలు..

ప్రస్తుత ఆధునీకతకు తగ్గట్టుగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కెట్‌లో వైవిధ్యమైన రాఖీలు వచ్చాయి. చెమ్కీ, స్టోన్ రాఖీలు, ఫ్యాన్సీ రాఖీలు, కుందన్‌లతో చేసిన డిజైన్ల రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.300ల వరకు రాఖీల ధరలు ఉన్నాయి. అన్నావదిన రాఖీలు, అక్షింతలు, కుంకుమలతో ఉన్న రాఖీలు ఆకర్షణీయంగా ఉన్నాయి. వీటికి తోడు వెండి పూత రాఖీలు విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాల్లోని తమ సోదరులకు రాఖీ పౌర్ణమి నాటికి రాఖీలు చేరుకునే విధంగా కొరియర్, పోస్టల్, కార్గో సర్వీస్‌ల ద్వారా పంపించటానికి మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంకా విభిన్నంగా మార్కెట్లో ఫొటో రాఖీలు ట్రెండ్‌గా మారాయి. రాఖీలో అన్నాచెల్లెళ్లు కలిసి ఉన్న ఫొటోలు పెట్టి రాఖీలు విక్రయిస్తున్నారు. కొత్త డిజైన్లలో గతంలో కంటే ఈ సారి ఎక్కువ వెరైటీలు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు తెలిపారు.

స్వయంగా రాఖీ కడతా..



మా అన్నయ్యకు ప్రతి ఏటా స్వయంగా రాఖీ కడతా. ఉద్యోగ రీత్యా ఏ ఊరిలో ఉన్నా.. రాఖీ పౌర్ణమి రోజు మాత్రం కలుసుకొని రాఖీ కట్టడం నాకు చాలా ఇష్టం. మార్కెట్‌లో చాలా వెరైటీలతో రాఖీలు ఉన్నాయి. అన్నయ్య కోసం మంచి రాఖీ కొని కట్టడంలోనే సంతోషం ఉంటుంది.

– కె.లక్ష్మిప్రియ, సత్తుపల్లి

రాఖీలు, స్వీట్లు విక్రయిస్తాం..



ప్రతి ఏటా రాఖీ వేడుకకు స్వీట్లు తాయరుచేస్తాం.. మొత్తం 20 రకాల స్వీట్లు తయారు చేస్తున్నాం. గత సంవత్సరం వ్యాపారం బాగానే ఉంది. ఈ సారికూడా అంతకు మించి లాభం వస్తుందనే ఆశిస్తున్నా. షాపుముందు ప్రత్యేకంగా టెంట్లు వేసి రాఖీలు, స్వీట్లు పెట్టి విక్రయిస్తుంటాం. వీటిలో ప్లవర్స్, దేవుళ్ల, వివిధ రకాల ఆకృతుల్లో ఉన్నాయి.

– రామ్‌దేవ్, స్వీట్ షాపు నిర్వాహకుడు, తల్లాడ


తల్లాడలో ఏర్పాటు చేసిన స్వీట్ షాప్

పూలు, పండ్లకు గిరాకీ..

వరలక్ష్మీదేవి వ్రతం వేడుకలు, మరుసటి రోజే రాఖీ పౌర్ణమి రావటంతో పూలు పండ్లకు కూడా గిరాకీ పెరిగింది. పూలు చెండు రూ.50, మల్లెపూలు మూర 40 రూపాయలు వరకు ధర పలుకుతుంది. యాపిల్ పండు రూ.25కు, దానిమ్మ రూ.25, అరటి పండ్లు డజను రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలికింది. సాధారణ రోజుల కంటే పూలు, పండ్లు ధర పెరిగింది. దీంతో సామాన్యులపై భారం పడింది.

నైలాన్ తాడునే వాడాలి..


వైరా: అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు


సత్తుపల్లిరూరల్: అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ ఏడీఈ ప్రసాద్‌బాబు, సిబ్బంది

వైరా/సత్తుపల్లిరూరల్/కల్లూరురూరల్: కరెంట్ షాక్ రాకుండా బట్టలు ఆరేసుకునేందుకు ఇనుప తీగలకు బదులు నైలాన్ తాడును మాత్రమే వాడాలని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ టి.శ్రీనివాసచారి ఆదేశాల మేరకు శుక్రవారం ట్రాన్స్‌కో సిబ్బంది.. వైరా టౌన్ సెక్షన్‌లో, సత్తుపల్లిలోని కాకర్లపల్లిలో, కల్లూరులోని నారాయణపురం గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బట్టలు ఆరేసుకునేదుకు, ఇంకా ఏ పని నిమిత్తం అయినా నైలాన్ తాడును మాత్రమే వాడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఐరన్ తీగను వాడొద్దని సూచించారు. ఒక ఇంటిలో వారే స్వయంగా నైలాన్ తాడును తీసుకెళ్లి బట్టలు ఆరేసుకునేందుకు ఇంట్లో కట్టి చూపించారు. ఐరన్ వాడితే విద్యుత్‌షాక్ వచ్చే ప్రమాదం ఉందని, దాని వల్ల ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందన్నారు. నైలాన్ తాడు వలన ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదాలు జరగవని, కరెంట్ వైర్లు ఏమైనా డామేజ్ అయినా తొందరపడి ముట్టుకోవద్దని, ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. కరెంట్ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని, మనం తీసుకునే జాగ్రత్తలతో ప్రాణాలను నిలబెట్టుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో విద్యుత్‌శాఖ ఏడీఈ ప్రసాద్‌బాబు, ఏఈ సుందర్‌కుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, రామారావు, కృష్ణయ్య, జూనియర్ లైన్‌మెన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ – పొలం బాట


గోకినేపల్లిలో పొలం బాట కార్యక్రమంలో ఏడీఈ, రైతులు

ముదిగొండ: విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని చిరుమర్రితో ఏడీఈ రామకృష్ణారావుతో పాటు విద్యుత్ అధికారులు పర్యటించారు. విద్యుత్ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయొద్దన్నారు. ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ లైన్లు మార్చడం, విద్యుత్ స్తంబాల మధ్య దూరం ఎక్కువగా ఉన్న చోట మధ్యలో మిడిల్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు రైతులకు వివరించారు. వర్షాల కారణంగా విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ముదిగొండ, పమ్మి విద్యుత్‌శాఖ ఏఈలు ఎం శ్రీనివాస్, నారాయణ, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జవహర్ లిఫ్ట్ శంకుస్థాపనకు తరలిరండి


మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మధిర మండలం వంగవీడు వద్ద జవహర్ ఎత్తిపోతల పథకానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం శంకుస్థాపన చేయనుండగా కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు కోరారు. శుక్రవారం ఎర్రుపాలెంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని మీనవోలు నుంచి వంగవీడు లిఫ్ట్ పైలాన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డితో పాటు చావా రామకృష్ణ, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీనివాసరావు, తల్లపురెడ్డి నాగిరెడ్డి, మల్లెల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌కు సిద్ధారెడ్డి పేరు పెట్టాలి..

మధిర మండలంలో నిర్మిస్తున్న లిఫ్ట్‌కు మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డి లేదా పీసీసీ మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు పేరు పెట్టాలని ప్రకృతి రైతు కుడుముల వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ తీసుకోవాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి చేసిన 16మంది లబ్ధిదారుల ఖాతాల్లో.. ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున జమ అయినట్లు ఎంపీడీఓ బి.సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి నిర్మాణాలను మరింత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, పంచాయతీ సెక్రటరీ హరికృష్ణకు.. ఎంపీడీఓ అభినందనలు తెలిపారు.

మధిరలో సినిమా చిత్రీకరణ


షూటింగ్‌లో దర్శకుడు, తదితరులు

మధిర: మధిర ప్రాంత కళాకారులను ప్రేక్షకులు ఆదరించాలని రచయిత, దర్శకుడు, నటుడు ఏ.ఆర్.సమీర్ కోరారు. ఖాజీపురం గ్రామానికి చెందిన సమీర్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న 'డైరెక్టర్ సాబ్ ఏ.ఆర్.సమీర్ భాయ్' సినిమా చిత్రీకరణ మధిర, ఆత్కూరు, ఖాజీపురం పరిసరాల్లో నిర్వహించారు. పెనుగొలనుకు చెందిన షేక్ సాయిబాబు, మధిర వాసి మీరా తదితరులు షూటింగ్‌లో పాల్గొనగా సమీర్ వివరాలు వెల్లడించారు. తమ చిత్రాలను సిటీ కేబుల్‌తో పాటు 'ఏఆర్ సమీర్ టాకీస్ మధిర' యూట్యూబ్ చానల్‌లో చూడాలని కోరారు.

నులిపురుగుల నిర్మూలనకు సహకరించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

తల్లాడ: పిల్లల్లో ఎదుగుదలకు అవరోధంగా నిలిచే నులిపురుగుల నిర్మూలనకు అందరూ సహకరించాలని మండల వైద్యాధికారి కె.ప్రత్యూష అన్నారు. శుక్రవారం తల్లాడ మండల పరిత్ కార్యాలయంలో నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 1నుంచి 19ఏళ్లలోపు వారందరికీ ఈనెల 11న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల (ఆల్బెండజోల్) నివారణ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. వీటిని వేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.సురేష్‌కుమార్, ఎంపీడీఓ సురేష్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, శివ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి


తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చింతకాని: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకులు మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో భూస్వాములకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే.. అర్హులైన నిరుపేదల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు జానికిరాములు, ఉపేందర్, రవి, వెంకటనర్సయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేత

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోడూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపురం గ్రామంలో నిరుపేద వృద్ధ మహిళ తమ్మిశెట్టి అగ్నేషమ్మకు నిత్యావసర సరుకులు అందజేశారు. రూ.3 వేల విలువైన నిత్యావసర సరుకులతో పాటు ఖర్చుల కోసం రూ.2 వేలు నగదు కూడా అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో శీలం వెంకట్‌రెడ్డి, కనకదుర్గప్రసాద్, కటికి వెంకటేశ్వరరావు, పొట్టేటి అంకిరెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి


మండల యూనిట్ బాధ్యులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న చెంచిరెడ్డి

సత్తుపల్లిరూరల్: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికై నిరంతర కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వనమారెడ్డి చెంచిరెడ్డి, సత్తుపల్లి యూనిట్ ప్రధాన కార్యదర్శి బద్రుద్దీన్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని కార్యాలయంలో 175మంది విశ్రాంత ఉద్యోగులకు జిల్లా సంక్షేమశాఖ గుర్తింపు కార్డులను అందించారు. ఈనెల 15వరకు ఉద్యోగ జేఏసీకి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అప్పటివరకు వేచిచూసి అనంతరం ఉద్యమ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల యూనిట్ నాయకులు ఏఎస్ ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, డి.కృష్ణయ్య, సాంబశివరెడ్డి, వి.వెంకటరత్నం, మల్లికార్జున్‌రావు, జి.కృష్ణయ్య, బూరుగు దాసు, బి.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక చట్టాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

చింతకాని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మిక చట్టాలను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు స్పందించి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పిస్తూ, రైతు కూలీల చట్టాలను అమలు చేస్తున్నట్లు జీవోలు తీసుకురావాలని కోరారు. ఈ సభలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వత్సవాయి జానికీరాములు, అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి


నినాదాలు చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, గిరిజనులు

సత్తుపల్లిరూరల్: దమ్మపేట మండలంలోని నాగుపల్లి పంచాయతీ పరిధిలోని 454 సర్వే నంబర్‌లోని భూదాన భూమిలో ఎప్పటినుంచో సాగుచేసుకుంటున్న ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సత్తుపల్లి సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి సంబంధం లేని ఫారెస్ట్ వాళ్లు.. సాగు చేసుకుంటున్న ఆదివాసీ బిడ్డలను అక్రమంగా అరెస్టులు చేసి తప్పుడు కేసులు పెట్టడం ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అన్ని వర్గాలు తీవ్రంగా ఖండించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ సత్తుపల్లి డివిజన్ నాయకులు కుంజా కృష్ణ, సవ్వాళ్ల ఆదినారాయణ, మారుతి రాఘవులు, పామర్తి లక్ష్మయ్య, చలపతిరావు, రమేష్, వెంకట్రావు, పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

బోనకల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రావినూతల గ్రామంలో.. మరీదు నారాయణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్లు కల్పించని పక్షంలో కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు, ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు నరేష్, వీరభద్రం, గోపి, సైదులు, నన్నే సాహెబ్, నాగరాజు, గురవయ్య, అఫ్జల్, హుస్సేన్, వెంకటేశ్వర్లు, నాగులు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీవ్రతం పూజలు


కల్లూరురూరల్: మారెమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు


వైరాలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా పలు గ్రామాల్లోని దేవాలయాలు, ఇళ్లల్లో వరలక్ష్మీదేవి వ్రత సంకల్ప పూజా కార్యక్రమాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలతో, రకరకాల పిండి వంటలు, వడపప్పు, వివిధ రాకల ప్రసాదములను లక్ష్మీదేవికి సమర్పించి పూజలు నిర్వహించారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు అందించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మహిళలు రోజంతా ఉపవాస దీక్ష చేశారు. సాయంత్రం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కారేపల్లి: పూజ చేస్తున్న మహిళ


ముదిగొండ: అమ్మవారికి పూజలు నిర్వహించి, సమర్పించిన ప్రసాదం


తల్లాడలో..


సత్తుపల్లిలో వరలక్ష్మీవ్రతం చేస్తున్న మహిళలు


పెనుబల్లి: అడవిమల్లెల రామాలయంలో..